

సామాన్యులకు అండగా ప్రజాదర్బార్



పాల్గొన్న ఎంఎల్ఎ బండారు

ప్రజాశక్తి - రావులపాలెం

సామాన్యులకు అండగా ఉండేలా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని రూపొందించామని, ఎవరైనా వచ్చి తమ సమస్యలపై ఇక్కడ వినతులు సమర్పించవచ్చని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సం దర్భంగా 132 మంది తమ వినతులు సమర్పించగా ఎంఎల్ఎ అధికారులతో మాట్లాడి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కెవి.సత్యనారాయణరెడ్డి, గుత్తులరాంబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పైపైకి..

- జిఎస్‌టి 2.0పై వినియోగదారుల పెదవి విరుపు
- జిల్లాలో పూర్తి స్థాయిలో అమలుకాని కొత్త శ్లాబులు
- కేంద్రం ఆదేశించినా పట్టించుకోని వ్యాపారులు
- పాత ధరలనే వసూలు చేసిన వైనం

ప్రజాశక్తి - రాజోలు

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి జిఎస్‌టి 2.0 నూతన శ్లాబుల విధానం పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఇప్పటివరకూ అమల్లో ఉన్న 5, 12, 18, 28 శాతం శ్లాబుల స్థానంలో, కేవలం 5, 18 శాతం శ్లాబులను కేంద్రం ప్రకటించింది. కొత్త శ్లాబులను అనుసరించి విక్రయాలు సాగించాలని ఆదేశించింది. అయితే జిల్లాలో అనేక వస్తువుల ధరలను తగ్గించేందుకు వ్యాపారులు ఇష్టపడలేదు. ముఖ్యంగా నిత్యావసర సరకులు, మందులు, ఫుట్‌వేర్, వస్త్రాలపై నూతన జిఎస్‌టిని అనుసరించి ధరలను తగ్గించాల్సి ఉండగా, వ్యాపారులు పట్టనట్టు వ్యవహరించారు. వినియోగదారులు ప్రశ్నిస్తే పూర్తిస్థాయిలో సమాచారం రాలేదని వాదిస్తున్నారు. అంతేకాకుండా ఇప్పటికే తాము జిఎస్‌టి చెల్లించి కొనుగోలు చేసిన సరకులను తగ్గించి అమ్మడం సాధ్యం కాదన్నారు. కాగా ఎలక్ట్రికల్ వస్తువులు, కార్లు, బైక్‌లపై తగ్గిన శ్లాబులు అమల్లోకి వచ్చాయి. వాటికి దసరా ఆఫర్లు తోడవ్వడంతో కొనుగోలు చేసేం దుకు వినియోగదారులు ఎగబడ్డారు.

పెరిగిన నిత్యావసర సరుకులు

నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కందిపప్పు కొండెక్కి కూర్చొంది. కూరగాయల ధరలూ మండిపోతున్నాయి. వంట నూనెల ధరలు సలసలా కాగుతున్నాయి. ఆదాయం కంటే ఖర్చులు అధికమవడం, గతంలో ఎన్నడూ లేనివిధంగా నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు విలవిల్లాడుతున్నారు. కిలో కందిపప్పు ధర డబుల్ సెంచరీ కొట్టేలా కనిపిస్తోంది. రెండు వారాల క్రితం కిలో కందిపప్పు రూ.150 ఉండగా, ప్రస్తుతం రూ.173కు చేరింది. ఎండుమిర్చి ధర కిలో రూ.180 నుంచి రూ.220కు ఎగబాకింది. వెల్లుల్లి సామాన్యులకు అందనంత దూరం వెళ్లిపోయాయి. గత నెలలో కిలో రూ.240 ఉండగా, ప్రస్తుతం ఏకంగా రూ.400కు చేరింది. చింతపండు రూ.110 నుంచి రూ.140కు పెరిగింది. శనగపప్పు రూ.90 నుంచి రూ.100కు చేరింది. పెసలు రూ.115 నుంచి రూ.130, మినుములు రూ.110 నుంచి రూ.125, వేరుశనగ నూనె రూ.140 నుంచి రూ.160, ధనియాలు రూ.105 నుంచి రూ.120, నువ్వులు రూ.160 నుంచి రూ.170, పామాయిల్ రూ.80 నుంచి రూ.95, సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.105 నుంచి రూ.128 చొప్పన ధరలు పెరిగాయి.



దిగిరాని కూరగాయల ధరలు

కూరగాయల ధరలు ఇంకా దిగిరాలేదు. కిలో అల్లం రూ.160కు చేరింది. రూ.10 ఉండే కొత్తిమీర కట్ట రూ.60 పలుకుతోంది. రూ.40 ఉన్న వంకాయల ధర రూ.60కు పెరిగింది. బెండకాయలు, కాకర, బీరకాయలు, గోరు చిక్కుళ్ళు, దోస తదితర కూరగాయల గత నెలలో రూ.30 నుంచి రూ.35 మధ్యలో ఉండగా, తాజాగా రూ.50 నుంచి రూ.60 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. తీగ చిక్కుళ్లు గత నెలలో కేజీ రూ.80 కాగా, వీటి ధర ప్రస్తుతం రూ.120కు చేరింది. వానలు, వరదల నేపథ్యంలో కూరగాయల పంటలు పాడయ్యాయి. కొత్తగా వేసిన పంట చేతికి రావాలంటే, కనీసం రెండు నుంచి మూడు వారాలు పట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే కూరగాయల ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

తగ్గాల్సిన వస్తువులు ఇవే

మిల్క్, చీజ్, పిజ్జా, బ్రెడ్, చపాతీ, రోటీ, కొన్ని రకాల మందులు, నోట్‌బుక్స్, ఎక్సర్‌సైజ్ బుక్స్, పెన్సిల్స్, షార్ప్‌నర్స్, క్రయాన్స్ వంటివి 12 శాతం శ్లాబు నుంచి జీరో శ్లాబులోకి మార్చారు. అంటే వీటిపై జిఎస్‌టి వసూలు చేయకూడదు. అలాగే కండెన్స్‌డ్ మిల్క్, బటర్, నెయ్యి, చీజ్, రూ.2,500 కంటే తక్కువ ధర గల ఫుట్‌వేర్, వస్త్రాలు, కాటన్, జ్యూట్ హ్యాండ్‌బ్యాగ్స్, కొన్నిరకాల ఫర్నిచర్, కిరోసిన్ స్టవ్, లాంతర్లు, డ్రైఫ్రూట్స్, డయాబెటిక్ ఫుడ్స్, వ్యవసాయ యంత్రాలు, సౌరశక్తి పరికరాలు 12 శాతం నుంచి ఐదు శాతం శ్లాబ్‌లోకి మార్చారు. టాల్కమ్ పౌడర్, షాంపూ, హెయిర్ ఆయిల్, టూత్‌పేస్ట్, చాక్లెట్స్, కేక్, బిస్కెట్స్, కాఫీ, టీ ఎక్స్‌ట్రాక్ట్స్, ఐస్‌క్రీమ్, మినరల్ వాటర్ కూడా ఐదు శాతం శ్లాబులోకి వచ్చాయి. ఎయిర్ కండిషన్లు, డిష్ వాషింగ్ మెషిన్లు, 1200 సిసి కంటే తక్కువ ఇంజన్ సామర్థ్యం గల పెట్రోల్, 1500 సిసీ కంటే తక్కువ ఇంజన్ సామర్థ్యం గల డీజిల్ వాహనాలు 28 శాతం నుంచి 18 శాతం జీఎస్టీ శ్లాబులోకి మారాయి.

మధ్యతరగతిపై భారం

పన్ను రేట్లు పెరగడం వల్ల విద్య, ఆరోగ్యం, రవాణా, బ్యాంకింగ్ సేవల ఖర్చులు పెరుగుతాయి. ఇవన్నీ నేరుగా వినియోగదారులపై పడతాయి. ప్రభుత్వం మాత్రం దీర్ఘకాల ప్రయోజనం ఉంటుందని చెబుతున్నా, ప్రజలకు తక్షణ భారమే ఎక్కువగా అనిపిస్తోంది. పిడబ్ల్యుసి డైరెక్టర్ హితాంష్ గాంధీ మాట్లాడుతూ భారత దేశంలో జీవన వ్యయ సంక్షోభం సృష్టించా ఉందని చెప్పారు. గృహ పొదుపు రేటు గత నాలుగేళ్లలో తగ్గిపోయిందని తెలిపారు. రుణ భారం కూడా కుటుంబాలపై ఒత్తిడిని పెంచుతోందన్నారు.

నెలవారీ బడ్జెట్ పెరిగింది

మా ఇంట్లో నలుగురు కుటుంబ సభ్యులం ఉన్నాం. నిత్యావసర సరుకుల కొనుగోలుకు నెలకు రూ.10 వేల వరకు వెచ్చించక తప్పడం లేదు. విద్యుత్, పాల బిల్లు కలిపి మరో రూ.3 వేల వరకూ అవుతోంది. ఇంటి అద్దె గతంలో రూ.4,500 ఉండగా, ఇంటి పన్నులు పెరగడంతో అద్దె మరో రూ.500 పెంచడంతో రూ.5 వేలకు చేరింది. ఆరోగ్య అవసరాలకు, దుస్తుల కొనుగోలుకు ఇబ్బందులు తప్పేలా లేవు.

-కె.రాజు, శివకోడు

నేడు ఆటో డ్రైవర్ల సేవలో

ప్రజాశక్తి - అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో పథకం పేరిట ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్ల కోసం ప్రతి ఏడాది రూ.15 వేల సాయం ప్రకటించిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఈ నెల 4న శనివారం సిఎం చంద్రబాబు నిధులను ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో నేరుగా ఆటో డ్రైవర్ల బ్యాంకు ఖాతాకు జమ చేస్తారని తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి మండల స్థాయి వరకు ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మండల నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో నిర్వహించిన ఆటో డ్రైవర్ల సేవలో పథకం విధి విధానాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 7,709 మంది రూ.15 వేల చొప్పున లబ్ధి పొందనున్నారన్నారు. ఏడాదికి ఒక్కసారి రూ.15 వేలు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారన్నారు. పథకం ద్వారా ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్‌తో జీవనం సాగిస్తున్న డ్రైవర్ల ప్రయోజనం పొందుతారన్నారు. ఈ సాయం ప్రధానంగా వాహన నిర్వహణ ఖర్చులు, తిరుగుబాటు ఖర్చులు, బీమా, రిపేర్, ఫిట్‌నెస్ వంటి అవసరాలకు ఉపయోగించుకోవచ్చునన్నారు. డ్రైవర్ అదే వాహనం యజమాని అయి ఉండాలని, వాహనం ఎపిలో రిజిస్టర్ అయి ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఆధార్ కార్డు, వైట్ రేషన్ కార్డు ఉండాలన్నారు. ఒక్క కుటుంబానికి ఒకే వాహనానికి అర్హత ఉంటుందన్నారు. ఆదాయ పన్ను ఉండరాదన్నారు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రభుత్వ ఉద్యోగి, పెన్షనర్లు కాకూడదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆటో డ్రైవర్ల సేవలో పథకం కింద డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,709 మంది ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరి ఆటో జిల్లాలో మొత్తం రూ 11 కోట్లు, 56 లక్షల 35 వేల మేర ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా సిఎం చంద్రబాబు అమరావతి నుంచి ప్రారంభించి ఆటో డ్రైవర్ల ఖాతాలో జమ చేస్తారన్నారు. జిల్లాస్థాయిలో కలెక్టరేట్ నుండి గోదావరి భవన్లో ఆటో డ్రైవర్ల సేవ పథకం శనివారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి దేవుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హత పొందిన ఆటో డ్రైవర్లు 360 మంది

ఆలమూరు: మండల పరిధిలోని 18 గ్రామాల 24 సచివాలయాల పరిధిలో 360 మంది ఆటో డ్రైవర్లు పథకానికి లబ్ధిదారులుగా అర్హత సాధించారని ఎంపిడిఒ ఎ.రాజు శుక్రవారం తెలిపారు.

చేనేత బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగరలో గణపతి చేనేత సహకార సంఘం కార్మికులకు ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. చేనేత కార్మికులు 6 వరోజు శుక్రవారం నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో వారు పాల్గొని సంఘీభావం తెలిపారు. జాతీయ బిసి సమైక్య సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, హైకోర్టు అడ్వకేట్ గుత్తుల తులసిగిరి, రాష్ట్ర బి సి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎన్.గంగారామ్‌లు మాట్లాడారు. చేనేత కార్మికుల పడుతున్న ఇబ్బందులు మేరకు తాము ఎక్కడికి వచ్చి సంఘీభావం తెలియజేశామన్నారు. ప్రభుత్వం నుంచి చేనేత



మాట్లాడుతున్న బిసి సంఘం నాయకులు

కార్మికులకు రావలసిన బకాయిలు సుమారు రూ.4 కోట్లు వరకు రావలసి ఉందన్నారు. కార్యక్రమంలో బిసి సమీక్ష సంక్షేమ సంఘం ప్రసార కమిటీ చైర్మన్ వాసా రామ, రాష్ట్ర రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు దొమ్మేటి వేణు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు బి భూలోకం, రాష్ట్ర కోర్ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.వాసు తదితరులు పాల్గొన్నారు.



నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి -ఐ.పోలవరం

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను అరికట్టవచ్చని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. పిహెచ్‌సి కేంద్రం పరిధిలో ఐ.పోలవరం గ్రామంలో ఉన్న కుమ్మర్ల మెరక వీధిలో ఆయన శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆకస్మికంగా పర్యటించారు. పిహెచ్‌సి వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి ఇంటి పరిసరలలో నీటి నిల్వ ప్రాంతాలను తనిఖీ చేసి ప్రజలకు నీటి నిలువలను ఉంచు కోరాదని, దాని వల్ల దోమల పెరిగే ప్రమాదం ఉందని, దానివల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియ వంటి వ్యాధులు ప్రబలతా యని అన్నారు. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంటిలో గాని,ఇంటి బయట గాని, నీటి నిలువలు ఉంచుకోరాదన్నారు. హెచ్‌డబ్ల్యూసి సెంటర్‌ను సందర్శించి అటెండర్స్ పరిశీలించినారు. కేశనకుర్రు పిహెచ్‌సి కేంద్రాన్ని సందర్శించి ల్యాబ్ రికార్డ్స్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి పిఎస్ వి.రాజ్‌కుమార్, ఎంపిహెచ్ఇఒ ఎం.వెంకటేశ్వర్లు, ఆరోగ్య పర్యవేక్షకుడు కాటాడి రమేష్, హెల్త్ అసిస్టెంట్ ఎస్.శ్రీని వాస్, ఎఎన్ఎం డి.పద్మావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - అంబాజీపేట

కూటమి ప్రభుత్వం నాయకత్వంలో గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతు న్నామని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ సూచించారు. మాచవరంలో సర్పంచ్ నాగా బత్తుల శాంతా కుమారి,సుబ్బారావు ఆధ్వర్యంలో ఉపాధి హామీ నిధుల సహకారంతో సుమారు రూ.1.10 కోట్ల వ్యయంతో నాలుగు సిసి రోడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. దీర్ఘ కాలంగా ఆధునికీకరణకు నోచుకోని ఈ రహదారులు ప్రజల అభ్యర్థన మేరకు స్థానిక నాయ కుల కృషితో కలెక్టర్ అనుమతితో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఎంఎల్ఎ తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు ఎంఎల్ఎ గిడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి




సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ గిడ్డి

చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్‌పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి, స్టేట్ ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, స్టేట్ శెట్టిబలిజ డైరెక్టర్ బొంతు పెదబాబు, ఎఎంసి వైస్‌చైర్మన్ కొర్లపాటి ఢిల్లీ, సుంకర పేరయ్య నాయుడు, డి.సాయికృష్ణ, సుంకర బాలాజీ, పళ్ల శ్రీను, కొర్లపాటి గోపి, ఎం.తాతాజీ, పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనారాయణ పుట్టిన రోజు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

జడ్‌పిటిసి మాజీ సభ్యుడు, రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ పుట్టినరోజు వేడుకలను శుక్రవారం భీమనపల్లిలోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టినరోజు కేక్‌ను కట్ చేయించి లక్ష్మీనారాయణ, ఎంపిటిసి సభ్యురాలు నాగరత్నకుమారి దంపతులకు ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు దుశ్శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అలాగే



లక్ష్మీనారాయణ, రత్నకుమారి దంపతులను సత్కరిస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు

ఎంపీ గంటి హరీష్ మాదుర్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు లక్ష్మీనారాయణను సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపనే కెవిపిఎస్ ధ్యేయం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

సమాజంలోని సామాజిక వివక్షలను రూపుమాపి సమ సమాజా స్థాపనే లక్ష్యంగా కెవిపిఎస్ (కులవివక్ష వ్యతిరేకపోరాటసమితి) పని చేస్తుందని మండల శాఖ ఉపాధ్యక్షుడు యలమంచిలి బాలరాజు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధపార్కు ఆవ రణలో నిమ్మకాయల వెంకటేష్ ఆధ్వర్య ంలో గురువారం కెవిపిఎస్ 27వ ఆవి ర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న బాలరాజు కెవిపిఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మ గౌరవం, సమానత్వం, కుల వివక్ష అనే మూడు సిద్ధాంతాల ఆధారంగా కెవిపిఎస్ నిరంతరం పని చేస్తుందన్నారు. నేటికీ సమాజంలోని పేదలు, మరియు




ముమ్మిడివరంలో కెవిపిఎస్ ఆవిర్భావ వేడుక

మహిళలపై నిత్యం దాడులు జరుగు తున్నాయని అన్నారు. వీటిని అరికట్ట డంలో ప్రభుత్వాలు విఫలమౌతున్నాయని వి మర్శించారు. కెవిపిఎస్ బాధితుల పక్షాన పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాశి వెంకటాచారి, అడ్వకేట్ గొనమండ వెంకటేశ్వరరావు, దొండపాడు సతీష్, పలివెల ప్రసాద్, దొమ్మేటి వీర రాఘవులు, కాకి రాంబాబు, నిమ్మకాయల మహాలక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా నైపుణ్యంతోనే ఉపాధి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

పాఠశాలల నుంచి విద్యార్థులు వృత్తివిద్యను నేర్చుకోవడం వలన నైపుణ్యంతో పాటు ఉపాధి అవకాశాలు పొందవచ్చునని సమగ్ర శిక్ష జిసిటిఒ ఎంకె.భీమరావు అన్నారు. శుక్రవారం పేరవరం పిఎమ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ విభాగాలలో భాగంగా ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్న విద్యార్థులను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. రాజవరంలో ఫుడ్ ప్రాసెసింగ్ సంబంధించి ట్రినిటీ బేకరీ, టి రూములను పరిశీలించారు. ఈతకోటలో బేకరీ, స్వీట్ స్టాల్ లలో శిక్షణ పొందుతున్న విద్యార్థుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఐ.శ్రీనివాసరావు, ఇంచార్జి పి.శ్రీనివాస ఒకేషనల్ కోఆర్డినేటర్ కె.రమేష్, ఒకేషనల్ ట్రైనర్ ఉండ్రాసపు భాగ్యవతి పాల్గొన్నారు.



ప్రారంభించిన ఎంపిపి భవాని

పిహెచ్‌సిలో అదనపు గదుల ప్రారంభం

ప్రజాశక్తి - రామచంద్రపురం


ద్రాక్షారామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెండు చారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో నిర్మిం చిన అదనపు గదులను శుక్రవారం ప్రారంభించారు. సంకురాత్రి ఫౌండేషన్ ఛైర్మన్ సంకురాత్రి చంద్ర శేఖర్ చేతుల మీదుగా దీనిని ప్రారంభించారు. కార్యక్రమంలో మెండు చారిటబుల్ ఫౌండేషన్ అధినేత మెండు సాయి ఈశ్వర స్వామి, చక్రపాణి, కుటుంబ సభ్యులతో కలసి పాల్గొన్నారు. అదనపు గదులు నిర్మాణంతోపాటు రూ.2 లక్షల వైద్య పరికరాలు అందించినందుకు ద్రాక్షారామ పిహెచ్‌సి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఎంపిపి అంబటి భవాని అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సత్యనారాయణ, డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి, వైద్యాధికారులు రత్నసుధ, సందీప్ నాయుడు, డివిజనల్ సూపర్‌వైజర్ కమల్ శేషు, మాధవరపు వెంకటేశ్వర్లు, చిక్కాల సూర్యా రావు, పిహెచ్‌సి సూపర్‌వైజర్స్, వీరవేణి, జానికమ్మ, వరలక్ష్మి, సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపుపై ఇంటింటా అవగాహన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి తగ్గింపుతో ప్రజలకు వ్యాపార వర్గాలకు ఊరట లభిస్తుందని ఇంటింటా అవగాహన కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం భీమనపల్లిలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిడిఒ డి.కృష్ణ పర్యవేక్షించి జిఎస్‌టి తగ్గింపు వివరాలను ప్రజలకు తెలిపారు.

కార్టూ'నిజం'



ఈనిక దశలో వరి చేలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

జూలై నెలలో నాట్లు వేసిన తొలకరి వరిచేలు ప్రస్తుతం ఈనిక దశకు చేరుకున్నాయి. రామచంద్రపురం మండలంలో 17వేల 600 ఎకరాల్లోనూ, కె.గంగవరం మండలం 15 వేల 765 ఎకరాల్లోనూ తొలకరి నాట్లు వేశారు. అధిక శాతం రైతులు 90 శాతం వరకు స్వర్ణ రకాన్ని నాట్లు వేయగా మరో ఐదు శాతం బొండాల రకాన్ని, మరో ఐదు శాతం వేరే రకాలను నాట్లు వేశారు. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. ఈనిక దశ వరకు చేరిన వరి పంటలో అధిక శాతం ఆరోగ్యంగా ఉన్నప్పటికీ అక్కడక్కడ తెగుళ్లు ఆశిస్తున్నాయి. ముఖ్యంగా అగ్గి తెగులు, పొడ తెగులు, వంటివి తొలకరి చేల్లో కనిపిస్తున్నాయి. వీటితోపాటు ఎలుకలు బెడద రైతులను వేధిస్తుంది. అధిక ఉష్ణోగ్రత తెగుళ్లకు కొంతవరకు కారణం అవుతున్నట్లుగా తెలుస్తోంది

అధిక ఉష్ణోగ్రతల వల్ల తెగుళ్లు వ్యాపించవు

దీనిపై మండల వ్యవసాయ అధికారి మణిదీప్ మాట్లాడుతూ వరి పంట ఆశాజనకంగా ఉందని అధిక ఉష్ణోగ్రతలు కారణం వల్ల తెగుళ్లు అంతగా ఆశిం చవని రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి టివిఆర్. మణిదీప్ తెలిపారు. అవసరం మేరకు మాత్రమే పురుగు మందులు పిచికారీ చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అక్కడక్కడ వరిలో అగ్గి తెగులు



మణిదీప్



ఈనిక దశలో ఉన్న తొలకరి వరి చేలు

ఉందని ఆకులపై ముదురు గోధుమ రంగు కారపు మచ్చలు ఏర్పడతాయని వెన్నులో తాళ్లు లేక సగం నిండిన గింజలు ఏర్పడతాయని తెలియజేశారు . అగ్గి తెగులు నివారణ కొరకు 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ 75 శాతం లేదా 1.5 ఎమ్మెల్ ఐసో ప్రోత్సహిలైన్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసినట్లయితే నివారించవచ్చని తెలిపారు. ప్రస్తుత వాతావరణ మార్పుల్లో మెడ విరుపు తెగులు కూడా ఆశించే లక్షణాలు కనబడుతున్నాయని, దీని నివారణకు 2.5 మిల్లీమీటర్లు కాసుగా మైసిన్ లీటర్ నీటికి కలిపి వరి చేను బాగా తడి చేలాగా పిచికారీ చేయాలన్నారు. వరి నారు మడి దశలో వరి కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగు వంటి పురుగులు ఆశిస్తాయని వాటి నివారణ కి కార్బో ఫ్యూరన్ 3జి. గుళికలు 1 సెంట్ నారుమడికి 160 గ్రాము లు లేదా మోనోక్రోటోపాస్ 1.6 మిలీ లేక క్లోరిపైరిపాస్ 2.0 మీలి లీటర్ నీటికి విత్తిన 10 రోజులకు లేదా 17 రోజులకు పిచికారీ చేసినట్లయితే నాట్లు వేసిన తర్వాత అంతగా తెగుళ్లు ఆశించవని ఆయన వివరించారు.

బాణసంచా తయారీ స్థావరంపై దాడి

రూ. 5 లక్షల విలువైన ముడిసరుకు స్వాధీనం

ప్రజాశక్తి - మండపేట

టౌన్ పరిధిలో రావులపేట పెంకిటింటిలో ఎటువంటి లైసెన్సు అనుమతి లేకుండా దీపావళి బాణసంచా తయారు చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు మండపేట టౌన్ పోలీస్ లు గురువారం దాడులు చేశారు. సుమారు రూ .5 లక్షల విలువ గంధకం, అల్యూమినియం డస్ట్, బొగ్గు పొడి, ఆయిల్, ఇసుక ఇతర ముడి సామాన్లతో పాటు సుమారు 2,500 కేజీలు మతాబులు, చిచ్చుబుడ్లు తయారీకి ఉపయోగించే రసాయన మిశ్ర మాన్ని సీజ్ చేశారు. దీనిపై మండపేట టౌన్ సురేష్ కేసు నమోదు చేసి తయారీ దారుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ సురేష్ మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా లైసెన్సు లేకుండా ఎటువంటి మందుగుండు సామగ్రిని కలిగి ఉండటం, తయారు చేయటం, చట్టరీత్యా నేరమన్నారు. లైసెన్సు కలిగి ఉన్నవారు సంబంధిత నిబంధనలు పాటిస్తూ ఎటు వంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధ నలకు విరుద్ధంగా ఎవరైనా బాణసంచా సామగ్రి కలిగి ఉన్న, తయారు చేసిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రావులపేటలో మందు గుండు స్థావరంపై దాడి చేసిన పోలీసులు

భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

రైతులు భూముల రీ సర్వేకు పూర్తి సహకారం అందించాలని తహశీల్దార్ సునీల్ కుమార్ సూచించారు. మామిడికుదురు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ గౌస్ మొహిద్దిన్ అధ్యక్షతన శుక్రవారం రీసర్వేపై గ్రామ సభ నిర్వహించి అవగాహన కల్పించారు. రైతులు తమ భూములకు సంబంధించిన దస్తావేజు నకళ్ళు ఉద్యోగులకు అందజేసి సహకరిం చాలని అన్నారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ ఈలి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సర్వే వల్ల ప్రయోజ నాలు ఉన్నాయని అన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం భూముల రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ సమావేశంలో వ్యవసాయాధికారి ఎన్‌వివి.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి డి.కృష్ణాజీ, విఆర్ఒ మరియు రైతులు తదితరురుల పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - పెరవలి

మండలం నల్లాకులవారిపాలెం ముక్కామల సెంటర్ జాతీయ రహదారి యూటర్న్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వీరు ఖండవల్లికి చెందిన వారిగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఖండవల్లి గ్రామానికి చెందిన కంతేటి పోసియ్య, స్నేహితులు బాతు వెంకటేశ్వరరావు, ఇంజేటి ఇస్సాకు ఈ నెల 2న బైకుపై ఖండవల్లి నుంచి తణుకు బయలు దేరారు. వీరు నల్లాకులవారిపాలెం సెంటర్ వద్ద యూటర్న్ తీసుకొంటుడగా రావులపాలెం వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కంతేటి పోసియ్య (29), ఇంజేటి ఇస్సాకు (49) అక్కడికక్కడే మృతి చెందారు. బాతు వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు ఆసుత్రికి తరలించారు. మృతుడు పోసియ్య భార్య కనక దుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.వెకటేశ్వరరావు తెలిపారు.

యువకునిపై బీరు బాటిల్‌తో దాడి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామం పోలీస్ స్టేషన్ పరిధిలో గల చక్రి రెస్టారెంట్ వద్ద గురువారం రాత్రి ట్యాక్సీ డ్రైవర్ కొప్పుల మణిబాలరాజు అనే దళిత యువకుడిపై వెంకన్న అనే వ్యక్తి బీరు బాటిల్‌తో దాడి చేశాడు. ఈ దాడిలో బాలరాజు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తోట వెంకటచక్రధర్ నిర్వహిస్తున్న చక్రి రెస్టారెంట్లో వెంకన్న కొంతకాలం పని చేశాడు. అతని ప్రవర్తన బాగోలేకపోవడంతో ఇటీవల అతన్ని పని నుంచి తొలగించారు. దీంతో వెంకన్న మద్యం తాగి హోటల్ యజమాని చక్రిపై గొడవకు దిగాడు. అదే సమయంలో రెస్టారెంట్‌లో ఉన్న డ్రైవర్ మణి బాలరాజు వెంకన్నకు సర్ధిచెప్పే ప్రయత్నం చేశాడు. దీంతో ఆగ్రహానికి గురైన వెంకన్న బియ్యం పేటకు చెందిన తన ఇద్దరు స్నేహితులతో కలిసి బాలరాజుపై దాడి దిగారు. కింద పడేశారు. ఈ సమయంలో వెంకన్న బీరు బాటిల్‌ను పగులగొట్టి బాలరాజు కడుపులో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన బాలరాజును స్థానికులు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు ద్రాక్షారామం ఎఎస్ఐ రమణారావు తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

యువకుని అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-తుని

పట్టణంలోని రైల్వే ఫ్లయ్ ఓవర్ కింద తుని నర్సీపట్నం బస్టాండ్ సమీపంలో యువకుడి మృత దేహం కలకలం రేపింది. ముఖంపై తీవ్ర గాయాలతో ముఖ కవళికలు గుర్తుపట్టలేనంతగా ఉన్న యువకుడి మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తుని రూరల్ సిఐ చెన్నకేశవరావు హుటాహుటిన సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతదేహం లభించిన తీరును బట్టి ఆత్మహత్యగా భావిస్తున్నారు. పట్టాల మధ్యలో రెండు బాగాలుగా ఉన్న పురుషుని మృత దేహన్ని జిఆర్‌పి పోలీసులు శుక్రవారం గుర్తించారు. మతుని వయసు 40-45 ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు.

చోరీ కేసు నమోదు

ప్రజాశక్తి - జగ్గంపేట

రామవరంలో ముమ్మిడివరపు బ్రహ్మాజీరావు ఇంట్లో చోరీ చోటు చేసుకున్నట్టు వచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.60 వేలు నగదు చోరీ చేశారని బాధితుడు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.



ఎంఎల్ఏ ఆనందరావును సత్కరిస్తున్న దళిత ఐక్య వేదిక

ఎంఎల్ఎ ఆనందరావుకు ఘన సత్కారం

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం అభివృద్ధికి ఎంఎల్ఎ అయితా బత్తుల ఆనందరావు అహర్నిశలు కృషి చేస్తున్నారని జిల్లా దళిత ఐక్యవేదిక నాయకులు అన్నారు. ఎంఎల్ఎ ఆనందరావు సాధించిన డిగ్రీ కళాశాల పేద విద్యా ర్థులకు వరంగా మారిందన్నారు. దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఎల్ఎ ఆనందరావుని అభినందించి ఘనంగా సత్కరించారు. జిల్లా దళిత ఐక్యవేదిక ఛైర్మన్ డిబి లోక్ మాట్లాడుతూ నియోజ కవర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అమలాపురంలో ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా దళిత ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబురావు, కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, కోకన్వీనర్ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతి రావు, చల్లపల్లి సర్పంచ్ ఇసుకపట్ల జయమణి, జంగా శ్రీను, పాలమూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కాషాయాల తయారీని రైతులకు వివరిస్తున్న అధికారులు

పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

వరి చేలపై పురుగులు మందు వాడకాన్ని రైతులు తగ్గించాలని మండల వ్యవసాయ అధికారి సద్గురు మూర్తి సూచించారు. కె.గంగవరం మండలం కుందూరు గ్రామంలో మంచి వ్యవసాయ పద్ధతులపై పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రైతులు పురుగుమందుల వాడకాన్ని మోతాదు అవసరం మేరకే వాడాలని లేని ఎడల పొలాల్లో మేలు చేసే మిత్ర పురుగులు కూడా నశించడం, వాటి వల్ల నష్టం వాటిల్లుతుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారు చేసే కషాయాలను వాడడం ద్వారా శత్రు పురుగులను తగ్గించి మిత్ర పురుగుల సంఖ్యను పెంచడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తూమాటి ఆకు కషాయం తయారీని రైతుల సమక్షంలో చేసి చూపించారు. సమీకృత పురుగుల యాజమాన్యంలో భాగమైన పురుగులను పట్టే స్వీప్ నెట్స్ పొలంబడి కిట్లను రైతులకు అందించారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ జగతా రమణ నాయ కులు మేడిశెట్టి బాబి, ముసినే ఆనందరావు, నీటి సంఘం అధ్యక్షుడు కొరిపల్లి సురేష్, చిర్రా సురేష్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వ్యవసాయ సహాయకులు రేవతి, చంద్రశేఖర్, కృష్ణతేజ, రైతులు పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు మంత్రులకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 10వ తేదీ నుంచి తొమ్మిది రోజులు పాటు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు రావాలంటూ ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిసి నల్లం సూర్యచక్రధరావు శుక్రవారం మంత్రి వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర బిసి సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత, ఎన్ఆర్ఐ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌లకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.



మండపేట జడ్‌పి బాలికోన్నత పాఠశాలకు బీరువాలు అందజేత

పాఠశాలకు బీరువాల బహూకరణ

ప్రజాశక్తి - మండపేట

స్థానిక డాక్టర్ పాలడుగు సత్యవతి చంద్రమౌళి జడ్‌పి బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం దాతలు బీరువాలు బహూకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మెర్ల తాతారావు మాస్టారు జ్ఞాపకార్థం ఆయన మనవరాలు గుండపునీడి రవళి, గుండపునీడి రేణుకచౌదరిలు పాఠశాలకు రూ. 4 వేలు విలువ గల రెండు గోద్రెజ్ బీరువాలు, రెండు సింక్‌లు పాఠశాల హెచ్‌ఎం ముంగర వెంకటరాజుకు అందజేశారు. ఈ బీరువాలను ఎంఇఒ నాయుడు రామచంద్రావు, హెచ్‌ఎం వెంకట రాజు, ఉపాధ్యాయులు సమక్షంలో రిబ్బన్‌కట్ చేసి పాఠశాల రికార్డులు భద్రపరిచేందుకు ప్రారంభించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలలో పూర్వ విద్యార్థిని తిరిగి ఇక్కడే ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మెర్ల సుధారాణి తన తండ్రి పేరిట వారి చిన్నారులచే బహూకరించడం అభినందనీ యమన్నారు. పూర్వపు విద్యార్థులు పాఠశాలకు హాయం చేయా లనే మంచి సంకల్పాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బి సాయిరాం, సాయిబాబా, సుధారాణి, మేక సునీత తదితరులు, పాల్గొన్నారు.

ఛైర్మన్లకు ఘన సత్కారం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఇటీవల వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్‌గా నియమితులైన ఆత్రేయపురం గ్రామానికి చెందిన ముదునూరి వెంకటరాజు, పిఎసిఎస్ ఛైర్మన్ ముదునూరి రామభద్రిరాజును ఆత్రేయ పురం వేగేశ్న ట్రస్ట్ నిర్వాహకులు శుక్రవారం రచ్చబండ వద్ద ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు వేగేశ్న సునీత, వేగేశ్న ప్రసాద్ రాజు చంటి రాజు, చిలువూరి,లోకేష్ రాజు, ఉద్దరాజు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కేంద్ర కార్యవర్గ సభ్యునిగా బాలకృష్ణ నియామకం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

వైసిపిఎస్ కేంద్ర కార్యవర్గంలో పితాని బాలకష్ణకు చోటు దక్కింది. వైసిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ సిఎం వైఎస్.జగన్ ఆదేశాల మేరకు బాలకృష్ణను కేంద్ర కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ అధిష్ఠానం నుంచి గురువారం ఉత్తర్వులు అందాయని బాలకష్ణ తెలిపారు. ఈ అవకాశం కల్పించి నందుకు కృషి చేసిన సజ్జల రామకృష్ణారెడ్డి, ఉమ్మడి గోదావరి జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, ఎంపిపి మిథున్ రెడ్డి, ఎంపి వైవి.సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం పార్లమెంట్ పరిశీలకులు జక్కంపూడి విజయ లక్ష్మి, మాజీ ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌లకు బాలకృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు.

భీమేశ్వరుని దర్శించుకున్న అనంతపురం ఎంపీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అధికారుల ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



అర్హత పత్రాలు అందుకున్న విద్యార్థినులతో హెచ్‌ఎం కమల

ఉపాధి కోర్సులపై అవగాహన


ప్రజాశక్తి - ఆలమూరు

విద్యార్థులు విద్యతో పాటు పలు ఉపాధి కోర్సులపై అవగాహన పెంచుకొని స్వయం ఉపాధి పొందే దిశగా పయనించాలని జిల్లా జిసిడిఒ భీమారావు సూచించారు. మండల కేంద్రంలోని కండ్రిగలో ఉన్న డాక్టర్ బొబ్బా జయశ్రీ జడ్‌పి బాలికోన్నత ప్లస్ టు పాఠశాల నందు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పది రోజులు నిర్వహించిన బ్యూటీ అండ్ వెల్నెస్ కోర్సులపై అంతర్గత శిక్షణా కార్యక్రమం రావులపాలెం నందు ముగిసింది. ఈ కోర్సులపై శిక్షణ పొందిన పదిమంది విద్యార్థినులకు ధవీకరణ పత్రాలు ప్రధానోపాధ్యాయురాలు వై.కమల ఒకేషనల్ కోర్స్ ట్రైనర్ మాదాల లక్ష్మి సమక్షంలో శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

జిఎస్‌టి 2.0తో ప్రజలకు మేలు

ప్రజాశక్తి - రావులపాలెం

జిఎస్‌టి 2.0తో ప్రజలకు అనేక రకాలుగా మేలు జరుగుతుందని ఎంఎల్‌ఎ బండారు సత్యా నందరావు తెలియజేశారు. శుక్రవారం స్థానిక రిలయన్స్ స్మార్ట్ పాయింట్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వినియోగదారులను నూతన జిఎస్‌టిపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కెవి.సత్యనారాయణ రెడ్డి, గుత్తుల రాంబాబు, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, ముత్యాల బాబ్జి తదితరులు పాల్గొ న్నారు. **ఆత్రేయపురం:** కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జిఎస్టి తో రైతులకు మేలు చేకూరతుందని సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మన్ కరుటూరు నరసింహారావు అన్నారు. శుక్రవారం లొల్ల రేవు నుంచి ఆర్అండ్‌బి రోడ్డు నుంచి ఆత్రేయపురం వరకు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు రామకృష్ణంరాజు, మండల వ్యవసాయ అధికారి భార్గవ్‌మహేష్, లొల్ల, సొసైటీ అధ్యక్షులు మేడిది సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



23వ వార్డులో డ్రెయినేజీలో వ్యర్థాలు

డ్రెయినేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని పలు వార్డుల్లో డ్రెయినేజీలు ప్లాస్టిక్ వ్యర్థాలతో పేరుకుపోయాయి. మోడరన్ కాలేజీ పక్కన గల డ్రెయినేజీలో వ్యర్థాలు పేరుకుపోయాయి. 23వ వార్డులో త్యాగరాజ్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలంతా ప్లాస్టిక్ వ్యర్థాలను, సీసాలు, కవర్లు డ్రెయినేజీల్లో వేస్తున్నారు. దీంతో వ్యర్థాలు పెరిగిపోయి మురుగు నీటిని అడ్డుకుంటున్నాయి. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో పాటు ఈగలు దోమలు వృద్ధి చెందుతున్నాయి. మోడరన్ కాలేజీ నుంచి మండల పరిషత్‌కు, శివాలయానికి వెళ్లే రోడ్డు చెత్తతో నిండిపోయింది. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయినేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి మురుగు నీరు పారే విధంగా చర్యలు చేపట్టాలని, మోడరన్ కాలేజీ వీధిలో రోడ్డు వెంబడి పేరుకు పోయిన చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని రాజుపాలెం ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ కార్యదర్శి జిఆర్‌కె.బాలకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ ఓగూరి భాగ్యశ్రీ, దూడల స్వామి, ఎం.పురుషోత్తం, అత్తిలి బాబు రావు, మోకా బాలప్రసాద్, ఠానెలంక సొసైటీ అధ్యక్షుడు గోదాశి పుండరీష్ పాల్గొన్నారు.

రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా ప్రసాద్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా మండలంలోని తాడిపూడి మెయిన్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎస్‌విఎన్‌ఎస్.ప్రసాద్ ఎంపికైనట్లు ఎంఇఒలు పివి.ప్రసాదరావు, ఎ.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. డిఎస్‌సి-2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు రాజానగరం మండలంలో కొండ గుంటూరు గ్రామంలోని ఇంగ్లీష్ సబ్జెక్టు సంబంధించి ప్రసాద్ ఈనెల 3 తేదీ నుంచి 10 తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు . ఈ కార్యక్రమానికి సంబంధించిన ఉత్తర్వులు శుక్రవారం జారీ అయినట్లు విద్యాశాఖ అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

ఘనంగా రిపబ్లికన్ పార్టీ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక అంబేద్కర్ కన్వెన్షన్ హాలు నందు శుక్రవారం దడాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆర్‌పిఐ 68వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్ర మంలో పాల్గొని ఎన్‌ఎం.రుషి, తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, జెండాను ఆవిష్కరి ంచారు. కార్యక్రమంలో మోకా కృష్ణమూర్తి, జనిపల్లి సత్యనారాయణ, బుడితి నాగేశ్వరరావు, నేరేడుమిల్లి అబ్బులు, మోర్త ధన కాసులు, చికురుమిల్లి శ్రీనివాస్,పై నరసింహ మూర్తి, పలువురు అంబేద్కరీయులు తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

నియోజకవర్గంలోని నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మూడు మండలాలకు సంబంధించి పలు గ్రామాల నుంచి ఇటీవల వివిధ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న వారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. వేలివెన్ను రైతు సంఘ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మొత్తం 64 మంది లబ్ధిదారులకు రూ.27.20 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పార్టీ నాయకులు, లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - ఆలమూరు

గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన మినరల్ వాటర్ అందించే లక్ష్యంతో ఆర్ఒ ప్లాంట్‌ను పునఃప్రారంభించి నట్లు సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు తెలియజేశారు. ఆయన ఆధ్వర్యంలో ఇటీవల మండలంలోని జొన్నాడ గ్రామంలో చెరువుగట్టు వద్ద ఉన్న ఆర్ఒ ప్లాంట్‌కు కట్టా రామకృష్ణ, లక్ష్మి దంపతుల సహకారంతో రూ.2.50లక్షలతో నూతన ప్లాంట్ ఏర్పాటు చేసి వినియోగానికి సిద్ధం చేశారు. ఈ మేరకు గురువారం గ్రామ నాయకులతో కలిసి నూతనంగా లక్ష్మి రామకష్ణ మినరల్ వాటర్ ప్లాంట్‌ను పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రజలు ఈ ఆర్ఒ ప్లాంట్ నుంచి గతంలో కేవలం రూ.5 మాత్రమే చెల్లించి క్యాన్లలో స్వచ్ఛమైన మినరల్ వాటర్ ను తీసుకు వెళ్లేవారన్నారు. సాంకేతిక మరమ్మతుల కారణంగా ఈ ఆర్ఒ ప్లాంట్ మినరల్ వాటర్ సరఫరా నిలిచిపోయిందన్నారు. అది ఇప్పుడు మరమ్మతులు పూర్తి చేసుకుని నూతనంగా అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ ప్లాంట్ నుంచి గతంలో మాదిరిగానే వాటర్ ప్లాంట్ నిర్వ హణ నిమిత్తం క్యాన్‌కు రూ.5 చెల్లించి స్వచ్ఛమైన మంచినీటిని గ్రామ ప్రజలు తీసుకు వెళ్లొచ్చని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ నేతలు పాల్గొన్నారు.